క్లుప్తంగా

రేపటి నుంచి దిగువ మండలో జాతర

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని దిగుడ మండలో ఈ నెల 16 నుంచి అంగరాడ నీలమ్మ తల్లి త్రిరాత్రి జాతర మహోత్సవాలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ నిమ్మక హైమావతి, నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, అలాగే రాత్రిపూట సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

700 లీటర్ల బెల్లంఊట ధ్వంసం

జియ్యమ్మవలస : మండలంలోని చినమేరంగి పరిసర ప్రాంతాలలో చినమేరంగి ఎస్సై పి. అనీష్ సిబ్బందితో కలిసి శుక్రవారం దాడులు చేపట్టి సారా తయారీకి సిద్ధం చేసిన 700 లీటర్ల బెల్లంఊటను, సారా తయారీకి సిద్ధం చేసిన సరుకులను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు.

సూర్యఘర్‌పై విస్తృత ప్రచారం



సూర్యఘర్ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వివిధ శాఖాధికారులు

పాలకొండ రూరల్: పర్యావరణ పరిరక్షణతో పాటు ఉత్పాదక వనరుల వినియోగంలో భాగంగా సోలార్ విద్యుత్‌పై క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి ఎస్. మన్మథరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయితీపై కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తున్న విద్యుత్ ప్యానళ్లపై అవగాహన కల్పించారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఎంపీడీఓ వీవీ రంగారావు, ట్రాన్స్‌కో ఏఈ శ్యామ్‌సుందర్, హౌసింగ్ ఏఈ మాధవరావు, ఈఓపీఆర్‌డీ కృష్ణారావు, తదితరులు ఆవిష్కరించారు.

అనారోగ్యంతో జేఎల్‌ఎం మృతి



బిడ్డిక శ్రీను (ఫైల్)

కొమరాడ: మండలంలోని సరుగుడు గూడ గ్రామానికి చెందిన బిడ్డిక శ్రీను (30) ఐదేళ్లుగా పెదశాఖ పరిధిలో ఉన్న గ్రామాలకు జూనియర్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం గిరిశిఖర గ్రామాలకు వెళ్తుండగా.. మార్గమధ్యలో ఛాతిలో నొప్పి రావడంతో అక్కడికక్కడే పడిపోయాడు. స్థానికులు గమనించి అతడ్ని కూనేరు రామభద్రపురం పీహెచ్‌సీ తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని విద్యుత్‌శాఖ ఏఈ జి.వెంటకరమణ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

మదుము ఏర్పాటు చేయాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న తిరుపతిరావు

గరుగుబిల్లి: గౌరీ సాగరం చెరువుకు మదుము ఏర్పాటు చేయాలని పెదగుడబ గ్రామానికి చెందిన మరడాన తిరుపతిరావు కోరారు. ఈమేరకు ఎంపీడీఓ జి.పైడితల్లిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గౌరీసాగరం చెరువు కింద సుమారు 30 ఎకరాల పైబడి ఆయకట్టు ఉందని, గతంలో ఉన్న మదుమును ఉపాధి హామీ వేతనదారులు కప్పేసి ధ్వంసం చేశారన్నారు. అధికారులు స్పందించి మదుము ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి ఎంపీడీఓ స్పందిస్తూ, మదుము ఏర్పాటు చేసేందుకు ఇరిగేషన్ అధికారులతో చర్చించనున్నట్లు చెప్పారు.

రబీ సీజన్‌లో జోరుగా వరినాట్లు..

- తాడు కొలతలతో నాట్లు వేస్తున్న రైతులు
- పెరుగుతున్న యంత్రాల వినియోగం



నాట్లు వేసే ముందు కొలతలు వేస్తున్న బెంగాల్ కూలీలు

భామిని: పాలకొండ డివిజన్ పరిధిలో నీటి వసతి ఉన్న చోట రబీ వరినాట్లు జోరుగా కొనసాగుతున్నాయి. సంప్రదాయంగా వస్తున్న వరి నాట్లలో వినూత్న మార్పులు చోటు చేసుకుంటున్నాయి. యంత్రాల వినియోగం కూడా ఎక్కువ కావడంతో రైతులకు తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో పనులన్నీ జరిగిపోతున్నాయి. స్థానిక వ్యవసాయ కూలీలతో పాటు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలతో చెందిన కూలీలు, అలాగే పశ్చిమ బెంగాల్‌కు చెందిన వ్యవసాయ కూలీలు సైతం అందుబాటులో ఉండడంతో పనులు జోరుగా సాగుతున్నాయి. తాడు సహాయంతో వరి నాట్లు వేయడం వల్ల అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయాధికారులు చెబుతుండడంతో ప్రస్తుతం డివిజన్ పరిధిలో తాడు సహాయంతో నాట్లు వేస్తున్నారు.

పాలకొండ నియోజకవర్గంలో రబీ వరిసాగు విస్తీర్ణం	
మండలం	సాగు విస్తీర్ణం
భామిని	1835 ఎకరాలు
సీతంపేట	615
పాలకొండ	2045
వీరఘట్టం	2710 ఎకరాలు

తక్కువ ఖర్చు..

ఎకరా పొలంలో నాట్లు వేయడానికి స్థానిక వ్యవసాయ కూలీలు రెండు వందల నారు కట్టలు వినియోగిస్తుండగా.. పశ్చిమబెంగాల్ కూలీలు కేవలం 60 కట్టల నారుతో తాడు సహాయంతో క్రమపద్ధతిలో నాట్లు వేస్తున్నారు. ఇలా వేయడం వల్ల కలుపు బాగా తగ్గి, దిగుబడులు పెరుగుతాయని అధికారులు చెబుతున్నారు. అలాగే తాడు పద్ధతిలో నాట్లు వేయడం వల్ల ఎకరాకు రూ. 4,200 ఖర్చవుతుండగా.. సంప్రదాయ ప్రకారం నాట్లు వేస్తే 6,800 రూపాయలు ఖర్చవుతోంది.

ఖర్చులు తగ్గుతున్నాయి..

లైన్ పద్ధతిలో వరి నాట్లు వేయడంతో ఖర్చుతో పాటు సమయం కూడా మిగులుతుంది. దూరం దూరంగా వరినాట్లు వేయడం వల్ల కలుపు తగ్గి దిగుబడి పెరిగే అవకాశం ఉంది.

– అల్లి రాజశేఖర్, రైతు, నేరడి–బి, భామిని మండలం

శాస్త్రీయమైనదే..

తాడు కొలతలతో వేసే వరినాట్లు శాస్త్రీయమైనదే. ముందుగా గోదావరి జిల్లాల్లో ఎక్కువగా చేపడుతుంటారు. దూరం, దూరంగా వరి కుదుళ్ల వేయడంతో గాలి, వెలుతురు బాగా తగిలి వేగవంతంగా చేను పెరుగుతుంది.

కె.సింహాచలం, వ్యవసాయాధికారి, భామిని

పౌష్టికాహార లోపం లేకుండా చర్యలు తీసుకోవాలి

- ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ



పౌష్టకాహారం ప్యాకెట్లు పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ

కొమరాడ: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఎలాంటి పౌష్టికాహార లోపం లేకుండా చూడాలని ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. మండలంలోని కంబవలస పంచాయతీ రాజ్యలక్ష్మీపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రం నిర్వహణ, పిల్లల నమోదు, పౌష్టికాహారం పంపిణీ, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. కచ్చితంగా పిల్లలకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం టాయిలెట్లు, తాగునీరు నిర్వహణపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లికార్జునరావు, సీడీపీఓ జి.సుగుణకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ గౌరీశంకరరావు, అంగన్‌వాడీ సిబ్బంది అలివేలు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్విన్‌పేటలో ప్రత్యేకాధికారి పర్యటన



జేకే పాడు కాలనీ గ్రామంలో పర్యటిస్తున్న ప్రత్యేకాధికారి టి.కనకదుర్గ, తదితరులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీలో మండల ప్రత్యేకాధికారి, ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ శుక్రవారం పర్యటించారు. ముందుగా ఆమె ఎస్టీ కాలనీలో ఓ లబ్ధిదారుడు ఏర్పాటు చేసుకున్న ప్రధాన మంత్రి సూర్యఘర్ యూనిట్‌ను పరిశీలించారు. అలాగే పారిశుధ్య నిర్వహణ, గృహ నిర్మాణాలు, తాగునీరు, ఎంఎస్‌ఎంఈ సర్వే ప్రగతిపై ఆరా తీశారు. అలాగే జేకే పాడు కాలనీ గ్రామాన్ని సందర్శించి ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా సందర్శించి విద్యార్థులు, చిన్నారుల ఆరోగ్యంపై అడిగి తెలుసుకున్నారు. ఈమె వెంట ఎంపీడీఓ ఎస్.సాల్మన్ రాజు, ఎంఈఓ బి.చంద్రశేఖర్, విద్యుత్ శాఖ ఏఈ రవికుమార్, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు ఉన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి

- డీపీఓ కొండలరావు



వసతిగృహంలో రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ కొండలరావు

జియ్యమ్మవలస/జియ్యమ్మవలస రూరల్: వసతిగృహాల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని పార్వతీపురం డీపీఓ కొండలరావు సూచించారు. పల్లెనిద్రలో భాగంగా మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ వసతిగృహం, అంగన్‌వాడీ మూడో కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. వసతిగృహానికి అదనపు గదులు అవసరమని భావించి, ప్రతిపాదనలు పంపించమని సిబ్బందికి సూచించారు. అనంతరం పక్కనే ఉన్న అంగన్‌వాడీ మూడో కేంద్రాన్ని సందర్శించి, చిన్నారుల హాజరు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, హౌసింగ్, రెవెన్యూ, ఐసీడీఎస్, తదితర శాఖల అధికారులు, ప్రధానోపాధ్యాయుడు వి. ధనంజయనాయుడు పాల్గొన్నారు.

● గిజబ పరిసరాల్లో ఏనుగుల గుంపు



మండలంలోని గిజబ గ్రామ పరిసరాలలో ఏనుగులు సంచరిస్తున్నాయి. నాగూరు నుంచి సంతోషపురం, తోటపల్లి గ్రామాల మీదుగా శుక్రవారానికి గిజబ పరిసరాలకు చేరుకున్నాయి. ప్రస్తుతం ఆయా గ్రామాలలో అరటి పంటలు, పామాయిల్, మొక్కజొన్న, తదితర పంటలు సాగులో ఉన్నాయి. ఆయా పంటలను నాశనం చేయడంతో పాటు ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఏనుగుల గుంపును తరలించాలని ప్రజలు కోరుతున్నారు. – గరుగుబిల్లి

వినతులు పరిష్కరించాలి



సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్ బాలమురళీకృష్ణ

పాలకొండ: రెవెన్యూ సదస్సుల్లో అందించిన వినతులను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ బాలమురళీకృష్ణ తెలిపారు. మండలంలోని వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లతో శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రీ సర్వేకు సంబంధించి వచ్చిన వినతులను గ్రామస్థాయిలో పరిశీలించి, పరిష్కరించాలని సూచించారు. అనంతరం గ్రామాల వారీగా వచ్చిన ఫిర్యాదులు, పరిష్కారంపై సమీక్షించారు. మండల సర్వేయర్ శ్రీనివాసరావు, రీ సర్వే డీటీ సన్యాసిరావు ఉన్నారు.

రక్తదానంపై అవగాహన తప్పనిసరి



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

పాలకొండ: విద్యార్థులు రక్తదానంపై అవగాహన పెంచుకోవాలని ఏరియా ఆస్పత్రి చిన్న పిల్లల వైద్య నిపుణుడు రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక సత్యసాయి విద్యా సంస్థల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యపరంగా ఎటువంటి నష్టం ఉండదని తెలిపారు. యువత, విద్యార్థులు రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలుగా నిలుస్తారన్నారు. శిబిరంలో 48 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. పల్సస్ సీఈవో డాక్టర్ గేదెల శ్రీనుబాబు జన్మదినం సందర్భంగా ఈ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి విద్యా సంస్థల మేనేజ్‌మెంట్ బి. లక్ష్మీనారాయణ, డి. వెంకటరమణ, కైలాస్ , సత్యం, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ఊటలు ధ్వంసం

వీరఘట్టం: మండలంలోని బట్టిగూడ గిరిజన గ్రామ సమీపంలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 700 లీటర్ల బెల్లం ఊటలను పోలీసులు శుక్రవారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై జి. కళాధర్ మాట్లాడుతూ..సారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని పార్వతీపురం ఏఎంవీఐ జి.సత్యనారాయణ అన్నారు. కురుపాం మండలంలోని మొండెంఖల్లులో రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్లు, ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డు సేఫ్టీ నియమాలు వివరించారు. మద్యం మత్తులో వాహనాలు నడపవద్దని సూచించారు.

ఉన్నత స్థానాలు అధిరోహించాలి

- ప్రిన్సిపాల్ విజయనిర్మల



మాట్లాడుతున్న గురుకులం ప్రిన్స్‌పాల్ విజయనిర్మల

భామిని: గురుకులం విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలు అధిరోహించాలని స్థానిక అంబేడ్కర్ గురుకులం ప్రిన్సిపాల్ విజయనిర్మల ఆకాంక్షించారు. పది, సీనియర్ ఇంటర్ విద్యార్థులకు గురుకులం ఆవరణలో శుక్రవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థినులు పలు గీతాలకు నృత్యం చేశారు. కార్యక్రమంలో గురుకులం టీచర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

చిన్నారులకు మెరుగైన పౌష్టికాహారం

- ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి



చిన్నారులతో ముచ్చటిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: అంగన్‌వాడీ చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని ఐటీడీఏ పీఓ సి. యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని సోమగండి గ్రామాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించారు. చిన్నారుల ఎత్తు, బరువులకు సంబంధించిన రికార్డులు, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, సీడీపీఓ రంగలక్ష్మి పాల్గొన్నారు.

వసతుల కల్పనపై నిర్లక్ష్యం తగదు

- మండల ప్రత్యేకాధికారి మన్మథరావు



విద్యార్థులతో మమేకమై వారి ప్రమాణాలు తెలుసుకుంటున్న ప్రత్యేకాధికారి శివ్వాల మన్మథరావు

పాలకొండ రూరల్: గ్రామాల్లో కనీస మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం తగదని పశుసంవర్ధక శాఖ జె.డి, మండల ప్రత్యేకాధికారి డాక్టర్ శివ్వాల మన్మథరావు అన్నారు. పల్లెదర్శిని కార్యక్రమంలో భాగంగా పాలకొండ మండలం గోపాలపురంలో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పారిశుధ్య, తాగునీటి వనరుల నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మమేకమయ్యారు. ఈయన వెంట ఎంపీడీఓ వీవీ.రంగారావు, ఈఓపీఆర్‌డీ కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

జీవ నైపుణ్యాలు పెంచుకోవాలి



శిక్షకుడు సురేష్ కుమార్‌ను సన్మానిస్తున్న హెచ్‌ఎం, సహోపాధ్యాయులు

పాలకొండ రూరల్: విద్యార్థి దశ నుంచే జీవన నైపుణ్యాల పెంపుదలపై అవగాహన పెంచుకోవాలని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.సూర్యనారాయణ అన్నారు. ఈ మేరకు పాఠశాల విద్యార్థులకు సమగ్ర శిక్షాభియాన్ నేతృత్వంలో ప్రత్యేక శిక్షణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షకుడు దూబ సురేష్‌కుమార్ ఒత్తిడిని అధిగమించడం , నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పించారు. గడిచిన ఏడు రోజులుగా కొనసాగుతున్న ఈ శిక్షణ శుక్రవారంతో ముగిసింది. కార్యక్రమలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బంది తీరుపై విచారణ

- సాక్షి ఎఫెక్ట్



ఏపీఓ సత్యంనాయుడుకు ఫిర్యాదు చేస్తున్న సంత నర్సిపురం ఉపాధి వేతనదారులు

వీరఘట్టం: చేసిన పనికి డబ్బులు రావాలంటే వారానికి రూ. వంద చొప్పున కమీషన్ ఇవ్వాలని ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు తమను వేధిస్తున్నారని వీరఘట్టం మండలం సంత–నర్సిపురం గ్రామానికి చెందిన ఉపాధి వేతనదారులు ఏపీఓ జి.సత్యంనాయుడకు ఫిర్యాదు చేశారు. 'పని కల్పించమంటే పొమ్మంటున్నారు' శీర్షికన శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఏపీఓ సత్యంనాయుడు స్పందించి గ్రామంలో విచారణ చేపట్టారు. వేతనదారులు, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ క్రమంలో ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్ల పనితీరుపై వేతనదారులు ఏపీఓకు ఫిర్యాదు చేశారు. విచారణ నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఏపీఓ తెలిపారు.

పింఛన్ సొమ్ము రికవరీపై విచారణ



విచారణ చేపడుతున్న డీఎల్‌డీఓ గోపాలకృష్ణ, ఎంపీడీఓ వెంకటరమణ

వీరఘట్టం: మండలంలోని నడిమికెల్ల గ్రామానికి చెందిన అనర్హులైన ఏడుగురు వ్యక్తులు 2018 – 19 కాలంలో పింఛన్లు తీసుకున్నారని లోకాయుక్తకు అందిన ఫిర్యాదుతో పలుమార్లు విచారణ చేపట్టిన అధికారులు తాజాగా పింఛన్ సొమ్ము రికవరీ చేసేందుకు శుక్రవారం మరోసారి విచారణ చేపట్టారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విచారణాధికారిగా వచ్చిన పాలకొండ డీఎల్‌డీఓ వి.గోపాలకృష్ణ, ఎంపీడీఓ బి.వెంకటరమణ సంబంధిత పంచాయతీ కార్యదర్శులను పిలిపించి వివరాలు సేకరించారు. అయితే గతంలో మంజూరు చేసిన పింఛన్ల వివరాల ఫైల్స్ లేవని అధికారులు చెప్పడంతో అధికారుల తీరుపై విచారణాధికారి ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రోజుల్లో ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తనకు తెలియజేయాలని లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని గోపాలకృష్ణ హెచ్చరించారు.

ఆ వివరాలు ఇలా ఉన్నాయి..

గత టీడీపీ పాలనలో 2018 – 19 మధ్య కాలంలో గ్రామానికి చెందిన ఎస్.లచ్చిశెట్టి (11 నెలలు), గంట రాము (11 నెలలు), బోను అప్పయ్య (21 నెలలు), కొమరాపు పోతయ్య (21 నెలలు), బి.లక్ష్మం (21 నెలలు), వై.వెంకయ్య (19 నెలలు), కె.సీతమ్మ (14 నెలలు) వృద్ధాప్య పింఛన్ల రూపంలో 2,12,750 రూపాయలు తీసుకున్నారు. వీరంతా అనర్హులని గ్రామానికి చెందిన యామక అప్పలనాయుడు అప్పట్లో లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై పలుమార్లు అధికారులు విచారణ చేపట్టి, 2019 డిసెంబర్‌లో వీరికి వస్తున్న పింఛన్లను నిలిపివేశారు. వీరి నుంచి నగదు రికవరీ చేయాలని గతేడాది ఆగస్టులో లోకాయుక్త నుంచి ఆదేశాలు రావడంతో అధికారులు తాజాగా విచారణ చేపట్టారు.

● పరిశీలన..



కురుపాం మండలం బియ్యాలవలస పంచాయతీ దురిబిలి గ్రామంలో ఎస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయాన్ని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ శుక్రవారం ఉదయం పరిశీలించారు. సుమారు 42 మంది ఆదివాసీ యువత డీఎస్సీ, పోలీస్ కానిస్టేబుల్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్, తదితర పోటీ పరీక్షల కోసం ఈ గ్రంథాలయంలోని పుస్తకాలు వినియోగించుకుంటున్నట్లు లైబ్రేరియన్ ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. – గుమ్మలక్ష్మీపురం (కురుపాం)

● కృతజ్ఞతలు..



వైఎస్సార్‌సీపీ గుమ్మలక్ష్మీపురం మండల అధ్యక్షుడిగా తనకు మూడోసారి అవకాశం ఇవ్వడంపై గుమ్మలక్ష్మీపురం ఎంపీపీ కుంబరుకు దీనమయ్య పార్టీ అధిష్ఠానం, పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు పార్టీ మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణిలను శుక్రవారం కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. తనకు గుర్తింపు ఇచ్చిన పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటానని, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా అన్నారు. ఆయనతో పాటుపార్టీ నాయకులు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, గొరిశెట్టి గిరిబాబు, కె.రాజేష్, వెంకటరావు, రామకృష్ణ, తదితరులున్నారు. – జియ్యమ్మవలస రూరల్